సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 19 । జనవరి । 2024



ఘనంగా సహస్ర తులసీదళార్చన

విశాఖ బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి గురువారం సహస్ర తులసీ దళార్చన నిర్వహించారు 8లో



గైరమ్మ జాతరకు వేళాయె

అనకాపల్లి పట్టణంలోని వేల్పులవీధిలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 8లో



పారదర్శకంగా ఓటర్ల జాబితా

ఓటర్ల జాబితా రూపకల్పనలో పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు, జె.శ్యామలరావు ఆదేశించారు. 8లో

న్యూస్‌రీల్

నవోదయ ప్రవేశ పరీక్ష రేపు

మారేడుమిల్లి : నవోదయ–2024లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 20 తేదీన జరిగే ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని స్థానిక ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ టి.అరుణ కుమారి గురువారం ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్ష కేంద్రం పరిధిలో 144 మంది విద్యార్థులు రాయాల్సి ఉందన్నారు. వీరంతా 20వ తేదీన ఉదయం 10 గంటలక ఆధార్ కార్డు, హాల్ టికెట్‌తో హాజరు కావాలని ఆమె కోరారు.

కొనసాగుతున్న చలి

- దట్టంగా పొగమంచు
- మినుములూరులో 10, చింతపల్లిలో 11.5, అరకులో 13.6 డిగ్రీల నమోదు



పాడేరు నుంచి మైదాన ప్రాంతాలకు వెళ్లే రోడ్డులో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: జిల్లాలో చలిగాలులు ఉధృతంగా వీస్తున్నాయి. పొగమంచు దట్టంగా కురుస్తోంది.మరోవైపు కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పాడేరు మండలం మినుములూరు కాఫీ బోర్డు వద్ద 10 డిగ్రీలు, చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వద్ద 11.5 డిగ్రీలు, అరకులోయలో 13.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికార వర్గాలు తెలిపాయి. చలి తగ్గుముఖం పట్టకపోవడంతో ఉన్ని దుస్తులు, చలిమంటలను ఆశ్రయించి ఉపశమనం పొందుతున్నారు.

మిలాన్‌కు పటిష్ట భద్రత



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ డాక్టర్ రవిశంకర్

విశాఖ సిటీ: నావికాదళం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 19 నుంచి 27వ తేదీ వరకు రెండు ఫేజ్‌లలో బీచ్ రోడ్డులో నిర్వహించనున్న మిలాన్–2024కు పటిష్ట భద్రతా చర్యలు ఏర్పాటు చేస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం పోలీస్ సమావేశ మందిరంలో నేవీ, పోలీస్ ఉన్నతాధికారులతో సీపీ సమావేశం నిర్వహించారు. మిలాన్‌కు ఇతర దేశాల నుంచి పలువురు ప్రముఖులు, ఉపరాష్ట్రపతి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు పలువురు వీవీఐపీ, వీఐపీలు వచ్చే అవకాశం ఉండడంతో వారి పర్యటన, సభా ప్రాంగణం వద్ద భద్రతా ఏర్పాట్లు, పార్కింగ్ సౌకర్యాలు, అధికారులు, సిబ్బందికి వసతి ఏర్పాట్లపై చర్చించారు. సమావేశంలో డీసీపీ–1 కె.శ్రీనివాసరావు, డీసీపీ–2 కె.ఆనందరెడ్డి, డీసీపీ(క్రైమ్) పల్లా వెంకటరత్నం, నేవీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

చలిమంటకు గాయపడిన వ్యక్తి మృతి



కన్నయ్య మృతదేహం

ఎటపాక: మండలంలోని వి స్సాపురం పంచాయతీ బండారుగూడెం గ్రామంలో చలిమంట అంటుకుని గిరిజనుడు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది.ఎస్‌ఐ పార్థసారధి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అదే గ్రామానికి చెందిన కుడియం కన్నయ్య(45) బుధవారం రాత్రి ఇంటి వద్ద మంచం పక్కనే చలిమంట వేసుకుని నిద్రించాడు. ఈక్రమంలో మంటలు అతడు కప్పుకున్న దుప్పటికి అంటుకోవడంతో కన్నయ్య శరీరం 80 శాతం కాలిపోయింది. తెల్లవారుజామున వెంటనే అతడిని భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

మారేడుమిల్లి : మండలంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పర్యాటకుల కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. రంపచోడవరానికి చెందిన షేక్ నాగూర్ బైక్‌పై వై.రామవరం మండలం పాత కోటకు వస్తుండగా మండలంలోని మద్దులూరు గ్రామం వద్ద పర్యాటకుల కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న నాగూరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతనిని స్థానిక పీహెచ్‌సీ తీసుకువచ్చారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి 108లో రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

1300 గ్రామాల్లో సమాచార విప్లవం

జిల్లాలో సమాచార వ్యవస్థ మెరుగుపడుతోంది. 2061 సెల్ టవర్ల నిర్మాణాన్ని ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 88 టవర్లను అందుబాటులోకి తెచ్చింది. మరో 278 టవర్లను ఈనెల 22న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా వర్చువల్ విధానంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇవి కూడా అందుబాటులోకి వస్తే జిల్లా వ్యాప్తంగా 1300 గ్రామాలకు నెట్‌వర్క్ అందుబాటులోకి వస్తుందని అధికారవర్గాలు తెలిపాయి.



ఈదులపాలెంలో సెల్ టవర్ ప్రారంభానికి సంబంధించిన ఏర్పాట్లపై సూచనలిస్తున్న పీవో అభిషేక్

- తొలివిడతలో 88 సెల్ టవర్ల నిర్మాణం
- రెండో విడతతో 278 పూర్తి చేసిన అధికారులు
- వర్చువల్ విధానంలో ఈనెల 22న రెండు చోట్ల ప్రారంభించనున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి
- ఏర్పాట్లలో అధికారుల నిమగ్నం

సాక్షి,పాడేరు: ప్రత్యేక జిల్లాగా ఏర్పాటైన తరువాత మన్యం రూపురేఖలు మారిపోయాయి. ఒకప్పుడు సమాచార వ్యవస్థ అందుబాటులో లేక జిల్లా ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. రాష్ట్రంలో అధికారంలో వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖ ఏజెన్సీని అల్లూరి సీతారామరాజు పేరిట ప్రత్యేక జిల్లా ఏర్పాటుచేసింది. వెనువెంటనే మౌలిక వసతుల్లో ప్రధానమైన సమాచార వ్యవస్థపై దృష్టి సారించి విడతల వారీగా సెల్ టవర్లను అందుబాటులోకి తెస్తోంది.

తొలి విడతలో 88..

జిల్లాలోని 22 మండలాల్లో 2061 టవర్లను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 88 టవర్లను అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా 500 గ్రామాల పరిధిలో 50 వేల మందికి సమాచార వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందని అధికారవర్గాలు తెలిపాయి. వీటిని గతేడాది జూన్ 14వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు.

మరో 278 టవర్లు సిద్ధం

రెండో విడతలో 278 సెల్ టవర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వీటిని ఈనెల 22వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే 800 గ్రామాల పరిధిలోని సుమారు లక్ష మందికి సమాచార వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు. పూర్తయిన 278 టవర్లలో ఎయిర్‌టెల్ కంపెనీకి చెందిన 103, రిలయన్స్ జియోకు చెందిన 175 టవర్లు ఉన్నాయి.

కలెక్టర్ ప్రత్యేక చొరవతో..

సెల్ టవర్ల నిర్మాణం వేగవంతం చేయడంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, రంపచోడవరం, చింతూరు, పాడేరు ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించారు. కలెక్టర్ తరచూ సమీక్షలు జరుపుతూ సెల్ టవర్ల నిర్మాణానికి స్థల సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టడంతో ప్రభుత్వం లక్ష్యం నెరవేరింది.



బూదరాళ్ల పంచాయతీ చీడిపల్లిలో పూర్తయిన సెల్ టవర్

అందుకు తగ్గట్టుగానే బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు నిర్మాణ పనులను వేగవంతం చేశాయి.

రెండో చోట్ల వర్చువల్ విధానంలో..

జిల్లాలో పూర్తయిన 278 సెల్ టవర్లలో పాడేరు మండలం మారుమూల ఈదులపాలెం, డుంబ్రిగుడ మండలం లయగండలోని సెల్ టవర్లను ఈనెల 22న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభిస్తారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ప్రారంభ ఏర్పాట్లలో నిమగ్నమైంది. సెల్ టవర్ల ప్రారంభించిన అనంతరం సీఎం ఆ రెండు గ్రామాల గిరిజనులతో మాట్లాడతారని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

ఏర్పాట్లను పర్యవేక్షించిన పీవో

సెల్ టవర్లను వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి ప్రారంభించే కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ గురువారం సాయంత్రం పరిశీలించారు. దీనిలో భాగంగా పాడేరు మండలం ఈదులపాలెంలో అధికారులతో సమీక్షించి సూచనలిచ్చారు.

ఆరు నెలల్లో అన్ని టవర్లు పూర్తి చేస్తాం



జిల్లాలో సమాచార వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నాం. రెండో విడతలో 278 సెల్ టవర్లను ఈనెల 22న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. రానున్న ఆరు నెలల్లో మిగతా సెల్ టవర్ల నిర్మాణాలను పూర్తి చేసేలా కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం.

– సుమిత్‌కుమార్, కలెక్టర్, పాడేరు

సబ్‌కలెక్టర్ విస్తృత తనిఖీలు

- వై.రామవరం మండలంలో సుడిగాలి పర్యటన
- ప్రజాపంపిణీ వ్యవస్థ, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో సేవలు పరిశీలన



వై.రామవరం సీహెచ్‌సీలో వైద్యాధికారిమోహన్‌కు సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



వై.రామవరంలో జీసీసీ నిత్యావసర వస్తువుల విక్రయశాలను తనిఖీ చేస్తున్న సబ్‌కలెక్టర్

వై.రామవరం: మండలంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ గురువారం పర్యటించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకున్నారు. మండల ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఇప్పటివరకు అందించిన వివిధ ధ్రువీకరణ పత్రాలు, పెండింగ్ దరఖాస్తులపై ఆరా తీశారు. భూరీసర్వే, ఓటరు జాబితాల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం వై.రామవరంతోపాటు మండలంలోని వివిధ గ్రామాల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. చేర్పులు, మార్పులపై అధికారులకు సూచనలిచ్చారు. జీసీసీ డీఆర్ డిపోలను తనిఖీ చేశారు. బియ్యం, తదితర నిత్యావసర వస్తువుల పంపిణీపై ఆరా తీశారు అనంతరం స్థానిక కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు, ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యాధికారి మోహన్‌ను సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. మెరుగైన వైద్యసేవలు అందించేందుకు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు, డీటీ కె.సుధాకరరావు, ఎన్నికల సెక్టోరల్ అధికారులు ఉషారాణి, సుధ పాల్గొన్నారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

- పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్
- ఇద్దరు వైద్యులకు షోకాజ్ నోటీసుల జారీ



వైద్యబృందాలతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: వైద్య విధుల పట్ల వైద్యబృందాలు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ హెచ్చరించారు. మండలంలోని ఈదులపాలెం పీహెచ్‌సీని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆస్పత్రిలోని రికార్డులతో పాటు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్యాధికారులు శ్రీను, నరసింహం విధులకు హాజరుకాకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీఎంహెచ్‌వోను ఆదేశించారు. వైద్య ఆరోగ్య కార్యక్రమాలపై సిబ్బందితో సమీక్షించారు. గర్భిణుల వివరాలు తెలుసుకున్న పీవో వారికి నిరంతరం వైద్యపరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రసవ సమయానికి వారం రోజుల ముందుగానే పీహెచ్‌సీలకు తరలించి సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వైద్యసేవల పట్ల ప్రత్యేకశ్రద్ధ చూపాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి సేవలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే
- కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: చింతూరు, రంపచోడవరం డివిజన్లో యువతీ యువకులు ఇక నుంచి ఆన్‌లైన్‌లో ఎంప్లాయ్‌మెంట్ కార్డులను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చునని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే వెల్లడించారు. గురువారం స్థానిక ఐటీడీఏ క్యాంప్ కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కరపత్రాలను ప్రాజెక్ట్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఆధార్ కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, ఫొటోలు, విద్యార్థతలకు సంబంధించిన సర్టిఫికెట్లు ఆన్‌లైన్ ద్వారా అప్లోడ్ చేసుకోవచ్చునన్నారు. గతంలో కార్డులు పొందిన వారు వాటిని ఆన్లైన్ ద్వారానే రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. రంపచోడవరం ఐటీడీఏ ప్రాంగణంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో కూడా సంబంధిత సర్టిఫికెట్లతో వచ్చి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. employment. ap.gov.in వెబ్‌సైట్‌లో ఎంప్లాయ్‌మెంట్ రిజిస్ట్రేషన్‌కు వివరాలు అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.అబు సలాం, జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి ఎ. సంగీత. కె.రాంబాబు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 29లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

మహారాణిపేట: ఉప ఖజానా(ట్రెజరీ) కార్యాలయం పరిధిలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఫిబ్రవరి 29వ తేదీలోగా జీవన ధ్రువీకరణ పత్రాలు(లైఫ్ సర్టిఫికెట్లు) అందజేయాలని జిల్లా ఖజానా అధికారి(డీటీవో) వై.సుధాకరరావు ఓ ప్రకటనలో కోరారు. జీవన, నాన్ ఎంప్లాయిమెంట్, ఫ్యామిలీ పింఛన్ దారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జత చేసి ఉప ఖజానా కార్యాలయం/మీసేవ/ ఇంటర్నెట్ కేంద్రాలు/ తపాలా శాఖ ద్వారా అందజేయాలని సూచించారు. సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు సమర్పించని పింఛనుదారుల పింఛన్‌ను ఏప్రిల్–2024 నుంచి నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ప్రతీ పింఛన్‌దారుడు సీతమ్మధార, భీమిలి ఉప ఖజానా కార్యాలయాలను సంప్రదించి.. ధ్రువీకరణపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

హుకుంపేట: మండలంలో సంక్రాంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. యువత థింసా నృత్యాలతో గ్రామాల్లో సందడి చేస్తున్నారు. విచిత్ర వేషధారణలో బుడియాలు ఆకట్టుకుంటున్నారు.



రాతులపుట్టులో థింసా నృత్యం చేస్తున్న యువత

175 స్థానాల్లో గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ
- ఈ నెల 25న భీమిలిలో బహిరంగ సభ
- సభ నిర్వహణపై పార్టీ ముఖ్యనేతలతో సమావేశం

సాక్షి, విశాఖపట్నం : వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాలకు సంబంధించి ఈ నెల 25న భీమిలిలో భారీ బహిరంగ సభ నిర్వహించనుంది. ఈ సభ నిర్వహణపై గురువారం ఎండాడలోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్యక్షతన ఉత్తరాంధ్ర జిల్లాల మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో గురువారం కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర నుంచే వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ప్రారంభకానుందని, ఇందులో భాగంగా భీమిలిలో నిర్వహించే భారీ బహిరంగ సభ దద్దరిల్లాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, నాయకులు సభకు తరలిరావాలన్నారు. ఈ సభలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్రలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ముఖ్యమంత్రి ప్రజలకు వివరిస్తారన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఐదు జోన్లగా విభజించామని.. సీఎం జగన్ అధ్యక్షతన అన్ని జోన్లలో కేడర్‌తో సమావేశాలు జరుగుతాయని వెల్లడించారు. వచ్చే ఎన్నికలకు పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ భేటీలు జరుగుతాయని వెల్లడించారు. తొలి బహిరంగ సభ ద్వారా ఉత్తరాంధ్ర కార్యకర్తలు, అభిమానులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారన్నారు. ఉత్తరాంధ్రపై సీఎం జగన్‌కు ప్రత్యేక శ్రద్ధ ఉందని, అందుకే ఈ ప్రాంతం నుంచి ఎన్నికల శంఖారావం పూరిస్తున్నట్లు వివరించారు. ఎవరికి ఎమ్మెల్యే.. ఎవరికి ఎంపీ టికెట్ ఇవ్వాలన్నది ముఖ్యమంత్రి నిర్ణయిస్తారని చెప్పారు.

కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్‌నాథ్, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, భీశెట్టి వెంకట సత్యవతి, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఇందుకూరి రఘురామరాజు, సురేష్‌బాబు, పార్టీ జిల్లాల అధ్యక్షులు కోలా గురువులు, ధర్మాన కృష్ణదాస్, పరీక్షిత్‌రాజు, చెట్టి పాల్గుణ, ఎమ్మెల్యేలు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, గొర్లె కిరణ్‌కుమార్, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, బడుకొండ అప్పలనాయుడు, బొత్స అప్పలనర్సయ్య, కడుబండి శ్రీనివాసరావు, విశ్వసరాయి కళావతి, పాముల పుష్ప శ్రీవాణి, అలజంగి జోగారావు, వాసుపల్లి గణేష్ కుమార్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కంబాల జోగులు, పెట్ల ఉమాశంకర్ గణేష్, కె.భాగ్యలక్ష్మి, తిప్పల నాగిరెడ్డి, గొల్ల బాబూరావు, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్, నియోజకవర్గ సమన్వయకర్తలు, ఇన్‌చార్జిలు కె.కె.రాజు, ఆడారి ఆనంద్‌కుమార్, పిరియా విజయ, డాక్టర్ తాలే రాజేష్, మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఉరుకూటి రామచంద్రరావు, మలసాల భరత్‌కుమార్, ముఖ్య నాయకులు సుకుమార్‌వర్మ, ఈర్లె అనురాధ, తమ్మినేని చిరంజీవి, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొన్నారు.

సామాజిక సమానత్వ యోధుడు అంబేడ్కర్



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్



అంబేడ్కర్ సెంటర్ వద్ద ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీ కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్, ఇతర అధికారులు

- జాయింట్ కలెక్టర్ కార్తీక్
- జిల్లా కేంద్రంలో సామాజిక సమతా సంకల్పం నిర్వహణ
- పాత బస్టాండ్ నుంచి భారీ ర్యాలీ

సాక్షి,పాడేరు: సామాజిక సమానత్వ యోధుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో సామాజిక సమతా సంకల్పంను గురువారం జిల్లా కేంద్రం పాడేరులో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జేసీ కె.కార్తీక్, ఐటీడీఏ పీవో అభిషేక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాతబస్టాండ్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు సమతా సంకల్ప ర్యాలీ నిర్వహించారు. అంతకుముందు ఐటీడీఏ సమావేశ మందిరంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఐటీడీఏ పీవో, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ మాట్లాడుతూ స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ విగ్రహాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈనెల 19న విజయవాడలో ప్రారంభిస్తున్నారని చెప్పారు. దేశ పరిపాలనకు అవసరమైన రాజ్యాంగాన్ని అంబేడ్కర్ రూపొందించారని చెప్పారు. ప్రపంచదేశాల్లో ఉన్న రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి కొన్ని ముఖ్యమైన అంశాలు సేకరించి రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. భారతదేశంలో అందరికీ సమానహక్కులు కల్పించి, మహిళలకు, పురుషులకు ఓటు హక్కు సమానంగా కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. భారతదేశంలో అత్యంత అతి పెద్ద రాజ్యాంగాన్ని రచించారని చెప్పారు. 75 ఏళ్లుగా రాజ్యాంగంలో ఎటువంటి సమస్యలు తలెత్తలేదన్నారు. అందరికీ సమాన అవకాశాలు, హక్కులు కల్పించారని అందుకే స్టాట్యూ ఆఫ్ లిబర్టీ అని అంబేడ్కర్ విగ్రహానికి నామకరణం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి వీఎస్.ప్రభాకరావు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎస్‌డీసీ వీవీఎస్.శర్మ, గిరిజన సంక్షేమ ఈఈ డీవీఆర్ఎం.రాజు, డీఈ ఒ.గౌరీశంకర్, డీఎల్‌డీవో డి.శాంతలక్ష్మి, డీఎల్‌పీవో పీఎస్.కుమార్, సర్పంచ్ కొట్లగుల్లి ఉషారాణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఐలకు బదిలీలు

సాక్షి, పాడేరు: జిల్లాలోని పలువురు సీఐలకు బదిలీలు చేస్తూ విశాఖ రేంజ్ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వుల్ల జారీ చేశారు. పాడేరు సీఐ సుధాకర్‌ను జిల్లా సోషల్ మీడియా సైబర్‌సెల్‌కు, విశాఖ రేంజి వీఆర్‌లో ఉన్న సీఐ ఎస్‌ఈ మహ్మద్‌ను జిల్లా డీఎస్‌బీ-2కు, రాజవొమ్మంగి సీఐ అల్లు స్వామినాయుడును విశాఖ రేంజి వీఆర్‌కు, జి.కే.వీధి సీఐ జి.అశోక్ కుమార్‌ను జిల్లా డీటీసీ సీఐగాను, ఇక్కడి డీటీసీ సీఐ పి.వెంకటరమణను కొయ్యూరు సీఐగా, కొయ్యూరు సీఐ ఆర్ఎస్‌కే బాజిలాల్‌ను ఏలూరు రేంజి వీఆర్‌కు పంపుతూ ఐజీ ఉత్తర్వులు ఇచ్చారు.

నేడు ఐటీడీఏలో స్పందన

సాక్షి,పాడేరు: స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్నిశాఖల జిల్లా అధికారులు హాజరుకావాలని ఆయన ఆదేశించారు. అన్నివర్గాల ప్రజలు స్పందనలో తమ వినతులు అందజేయాలని సూచించారు.

సింహాచలేశునికి స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన కనులపండువగా నిర్వహించారు. ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను శోభాయమానంగా అలంకరించి, కల్యాణమండపంలో వేదికపై కొలువుదీర్చారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. నీరాజనం సమర్పించారు. ఉభయ దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేత్రపర్వం.. నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం 9.30గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

గైరమ్మ జాతరకు వేళాయె



వేల్పులవీధిలో గౌరీపరమేశ్వరుల ఆలయం



ప్రత్యేకాలంకరణలో గౌరీపరమేశ్వరులు



అమ్మవారి సారె ఊరేగింపులో భక్తులు

- రేపే వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల మహోత్సవం
- ఉత్సవానికి 170 చరిత్ర
- భారీగా సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆకర్షణగా నిలవనున్న బాణసంచా కాల్పులు

అనకాపల్లి : పట్టణంలో వేల్పులవీధిలో సుమారుగా 170 ఏళ్లక్రితం వేల్పులవారి స్వగృహంలో గౌరమ్మ వెలిసింది. స్వర్గీయ కొమ్మాన నర్సింగరావు భార్య పార్వతమ్మ మృతి చెందింది. తన భార్యపై అభిమానంతో కొంత స్థలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని భావించారు. ఈ మేరకు 1920లో ఓ పాకలో గౌరమ్మను ప్రతిష్ఠించారు. వేల్పుల నూకాలమ్మ కుటుబం అమ్మవారిని నిత్యం పూజించేది. జనవరి మొదటి వారంలో వేల్పులవీధి కుటుంబీకులు అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించే వారు. అయితే అప్పట్లో జనం ఎక్కువగా వచ్చే వారు కాదు.. అంతా సంక్రాంతి సంబరాలు వచ్చి పోయే బంధువుల సందడిలో ఉండిపోయేవారు.

అప్పటి నుంచి అమ్మవారి ఉత్సవం వేల్పులవీధికే పరిమితం కాకూడదని వీధిపెద్దలు స్వర్గీయ రౌతు ఆదినారాయణ, బోయిన రమణ మరికొందరు భావిస్తూ జనవరి మూడో శనివారం ఉత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. అప్పట్లో నేలవేషాలు, బుర్రకథలు నిర్వహించేవారు.

ఉత్సవానికి మరిన్ని సొబగులు..

1983 తర్వాత ఉత్సవంలో కొద్ది మార్పులు చోటుచేసుకున్నాయి. రౌతు ఆదినారాయణ మరికొంతమంది సాయంతో సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఏర్పాటు చేయడం మొదలుపెట్టారు. దశలవారీగా గౌరీపరమేశ్వరుల ఉత్సవం ఖ్యాతినార్జించాయి. ప్రస్తుతం 30 రకాల నేల వేషాలు, 20 స్టేజీ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత తరుణంలో సాంస్కృతిక కార్యక్రమాల సంఖ్య పెంచుతూ వచ్చారు.

అమ్మవారి ఊరేగింపు...

అమ్మవారి ఊరేగింపు మొదట్లో వేల్పులవీధిలో మాత్రమే జరిపేవారు. ప్రస్తుతం మూడురోజుల పాటు నిర్వహిసూ వస్తున్నారు. శనివారం ఉదయం నుంచి పట్టణపురవీధులగుండా ఊరేగింపు సోమవారం తెల్లవారుజాము వరకు కొనసాగిస్తూ స్థానిక శారదానదిలో నిమజ్జనం చేస్తారు. ఈ ఉత్సవానికి సుమారు 3 నుంచి 4లక్షల మంది భక్తులు హాజరుకానున్నట్లు ఉత్సవ నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

నేలవేషాలు...బాణసంచా విన్యాసాలు

ఉత్తరాంధ్ర జిల్లాకు చెందిన కళాకారులతో పాటు ఒడిశాతోపాటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారులతో నేలవేషాలు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఉత్సవమంటే ముందుగా గుర్తుకు వచ్చేది మందుగుండు సీతారామయ్య బాణసంచా విన్యాసాలే. వివిధ ఆకృతులు ఏర్పాటు చేసి, వాటికి మందుగుండు అమర్చి చేసే విన్యాసాలు కచ్చితంగా చూసి తీరాల్సిందే. ఎన్టీఆర్ మైదానంలో రెండుగంటలపాటు క్రేకర్స్ సందడితో పట్టణం మారుమోగనుంది.

అమ్మవారి ఆలయ నిర్మాణం..

అమ్మవారి గర్భగుడి వరకు మెయిన్‌రోడ్డు విస్తరణ జరిగింది. ఆలయానికి వెనుకభాగాన ఉన్న ప్రైవేటు స్థలాన్ని తీసుకొని పూర్తిస్థాయిలో గుడిని అందంగా తీర్చిదిద్దారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు

అనకాపల్లి : స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల అమ్మవారి సారె ఊరేగింపు గురువారం నేత్రపర్వంగా సాగింది. వీధి మహిళలు పలు రకాల పిండివంటలు తయారు చేసి రామాలయం వద్ద ఉంచగా సారె ఊరేగింపును 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ప్రారంభించారు. పలు రకాల పిండి వంటలు తయారు చేసిన భక్తులను ఆమె అభినందించారు. సారె ఊరేగింపు మెయిన్‌రోడ్డు గుండా చిననాలుగురోడ్ల కూడలికి చేరుకొని తిరిగి నెహ్రూ చౌక్ మీదుగా ఆలయానికి చేరుకుంది. అమ్మవారికి సారె నివేదించి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకాడ బాబు, ఉపాధ్యక్షులు ఎస్.నర్సింగరావు, కార్యదర్శి మద్దాల నూకరాజు, సహాయ కార్యదర్శి పనస శ్రీకాంత్, కోశాధికారి వేల్పుల గణేష్, వీధిపెద్దలు ఉగ్గిన అప్పారావు, దోమరౌతు రామారావు, నల్లల దేముళ్లు, ముత్తా ఈశ్వరరావు గరికి వెంకటరావు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి...



ఈ ఏడాది గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. నెలరోజులుగా కమిటీ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్నిశాఖల అధికారుల సమన్వయంతో అధికారుల సమన్వయంతో ఏర్పాట్లు చేశాం.

– వాకాడ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు

పారదర్శకంగా ఓటర్ల జాబితా

రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు శ్యామలరావు



అధికారులతో సమీక్షిస్తున్న పరిశీలకులు శ్యామలరావు

సాక్షి, విశాఖపట్నం : ఓటర్ల జాబితా రూపకల్పనలో పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఓటర్ల జాబితా పరిశీలకుడు, రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు జిల్లా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా యువ ఓటర్ల నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో మోహన్‌కుమార్, ఈఆర్వోలతో ఓటరు జాబితా రూపకల్పన, సవరణ ప్రక్రియపై గురువారం మధ్యాహ్నం సమీక్ష నిర్వహించారు. పక్కా జాబితాను రూపొందించేందుకు అనుసరించే విధానాలపై దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా జాబితాలను పరిశీలిస్తూ పలు అంశాలపై ఆరా తీశారు. జిల్లాలోని జనాభా, ఓటర్లు, పోలింగ్ స్టేషన్ల నిష్పత్తి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒకే చోట ఐదుకు మించి ఉన్న పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగిన ఆయన భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఫైనల్ జాబితా ప్రచురణ కాపీలను రాజకీయ పార్టీల జిల్లా ప్రెసిడెంట్ లేదా సెక్రటరీలకు అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ జాబితాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ నెల 22న ఫైనల్ లిస్టు ప్రచురించనున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు చేపట్టామని జేసీ విశ్వనాథన్ తెలిపారు. సమీక్షలో ఈఆర్వోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర రెడ్డి, లక్ష్మారెడ్డి, మూర్తి, శేష శైలజ, అఖిల, ఎన్నికల సెల్ అధికారులు, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర తులసీ దళార్చన

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. అమ్మ వారి త్రికాల పంచామృతాభిషేక సేవలో ఉభయ దాతలు పాల్గొన్నా రు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో శిరీష తెలిపారు. ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

అనాథ చిన్నారులకు సర్పంచ్ సాయం

- బియ్యం, దుస్తులు, నిత్యావసర సరకులు అందజేత
- జర్రెల పంచాయతీ సర్పంచ్ భాగ్యవతికి గ్రామస్తుల అభినందనలు



సిర్లిమెట్టలో అనాథ పిల్లలకు బియ్యం, దుస్తులు అందిస్తున్న జర్రెల సర్పంచ్ భాగ్యవతి, నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని కుమడ పంచాయతీ సిర్లిమెట్ట గ్రామంలో తల్లిదండ్రులు లేక అనాథలైన ముగ్గురు పిల్లలకు జర్రెల పంచాయతీ సర్పంచ్ బొరగం భాగ్యవతి సాయమందించారు. కొద్ది నెలల క్రితం అనారోగ్యంతో తల్లిదండ్రులను కోల్పోయి ముగ్గురు పిల్లలు అనాథలై ఉన్నారని, సాయం కోసం ఎదురుచూస్తున్నట్టు సామాజిక మాధ్యమం ద్వారా తెలుసుకొని సిర్లిమెట్ట గ్రామానికి జర్రెల సర్పంచ్ భాగ్యవతి వెళ్లి అనాథ చిన్నారులు వంతాల చిట్టిబాబు, వంతాల అనిత, వంతాల సంజనల పరిస్థితిపై ఆరా తీశారు. వారికి దుస్తులు, రేషన్ సరుకులు, బియ్యం తదితర సామగ్రిని అందజేశారు. వీరిలో దివ్యాంగుడైన చిట్టిబాబుకు పింఛన్ రావడంలేదని గ్రామస్తులు తెలిపారు. దీనిపై సర్పంచ్ భాగ్యవతి ఆరా తీశారు. అనాథ పిల్లలకు ఆధార్ కార్డు ,రేషన్ కార్డులు లేనట్టు తెలుసుకున్న సర్పంచ్ రేషన్, ఆధార్ కార్డులు తీయించి, పింఛన్ వచ్చేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వం తరపున అనాథులకు సాయమందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ భాగ్యవతికి అనాథ పిల్లలతో పాటు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుమడ సర్పంచ్ ముక్తమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు బంగారమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, ఆనంద్, భాస్కర్, పూర్ణారావు తదితరులు పాల్గొన్నారు.

బాలుడిని మింగేసిన సెప్టిక్ ట్యాంక్





కుమారుడు మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి పార్వతి (ఇన్‌సెట్) కౌశిక్ వికాస్(ఫైల్)

ఆనందపురం: మండలంలోని పెద్దిపాలెంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. సంక్రాంతి పండగకు పెద్దమ్మ ఇంటికి వచ్చిన బాలుడు ప్రమాదవశాత్తు నిర్మాణంలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో జారి పడి దుర్మరణం పాలయ్యాడు. ఎస్ఐ గంట్యాడ సంతోష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమలాపురానికి చెందిన ఉప్పాడ పార్వతి భర్త జగన్ కొన్నాళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఆమె బతుకు తెరువు కోసం తన ఒక్కగానొక్క కుమారుడు కౌషిక్ వికాస్‌తో కలిసి ఏడాది క్రితం మధురవాడ సమీపంలోని వాంబే కాలనీకి వలస వచ్చింది. అక్కడ రోజు వారీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. కౌషిక్ వికస్ పెద్దమ్మ కుమారి మండలంలోని వెల్లంకి ఎస్సీ కాలనీలో కుటుంబంతో ఉంటోంది. ఇదిలా ఉండగా కౌషిక్ వికాస్(7) సంక్రాంతి పండగకని వెల్లంకిలోని పెద్దమ్మ ఇంటికి మూడు రోజులు క్రితం వచ్చాడు. గురువారం ఉదయం ఆడుకోవడానికి పిల్లలతో బయటకు వెళ్లాడు. అలా వెళ్లిన కౌషిక్ వికాస్ ఎంతకీ ఇంటికి రాక పోవడంతో పెద్దమ్మ కుమారితో పాటు చుట్టు పక్కల వారు వెదికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. ఈలోగా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీటితో ఉన్న మూతలేని సెప్టిక్ ట్యాంక్‌లో బాలుడు మృతదేహం కనిపించింది. ఈ మేరకు తల్లి పార్వతికి, పోలీసులకు కుమారి సమాచారం అందించింది. ఎస్ఐ గంట్యాడ సంతోష్ సంఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, కుమారుడు అకాలంగా మృత్యువాత పడడంతో ఇంకా తనకు దిక్కెవరంటూ కౌషిక్ వికాస్ తల్లి పార్వతి రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.

మానసిక ఆస్పత్రిలో పలు ఉద్యోగాల భర్తీ

దరఖాస్తుకు 20వ తేదీ గడువు

ఏయూక్యాంపస్: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో కాంట్రాక్ట్ విధానంలో పలు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ కె.వి.రామిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వైద్య విద్య డైరెక్టర్ ఆదేశాలను అనుసరించి చైల్డ్ సైకాలజిస్టులు-2, సైకో సోషల్ వర్కర్, స్పీచ్ థెరపిస్ట్, ఆక్యుపేషనల్ థెరపిస్ట్, స్పీచ్ ఎడ్యుకేటర్ ఉద్యోగాలు ఒక్కొక్కటి చొప్పున భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ నెల 20వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలు, దరఖాస్తుల కోసం https://visakhapatnam.ap.gov. in/documents/ ను సందర్శించాలన్నారు. దరఖాస్తుతో పాటు విద్యార్హత, వృత్తిపరమైన అనుభవాన్ని తెలియజేసే సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలను జతచేయాలని సూచించారు.

ఆదాయ పన్నుల శాఖ పీపీగా శ్రీనివాస్

విశాఖలీగల్: ఆదాయ పన్నుల శాఖ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వై.ఎస్.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదాయ పన్నుల శాఖ న్యాయవిభాగం కమిషనర్ శాలిని భార్గవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగుతారు. శ్రీనివాస్ ఇప్పటికే పరోక్ష పన్నుల విభాగం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు విశాఖ న్యాయవాదులు సంఘం అధ్యక్షుడు రాంబాబు తదితరులు అభినందించారు.

జాతీయ నేతలకు.. ఘనమైన నివాళి

కె.జె.పురంలో ఐక్యత వెల్లివిరుస్తుంటుంది. ఆ గ్రామంలో దేశ నాయకుల విగ్రహాల వద్ద ప్రతి ఏటా తీర్థాలు జరుగుతుంటాయి. 1950లోనే నాటి సర్పంచ్ పాలకుర్తి శ్రీరామూర్తి గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, అల్లూరి సీతారామరాజు వంటి నాయకుల విగ్రహాలను విజయవాడ నుంచి సొంత నిధులతో తీసుకొచ్చి ఇక్కడ ప్రతిష్ఠింపజేశారు. ఆ విగ్రహాల వద్ద గ్రామస్తులు తీర్థాలు నిర్వహిస్తూ ఐక్యత చాటుతున్నారు. అలాగే ఇక్కడి వీధులకు కూడా దేశ నాయకుల పేర్లు పెట్టటం మరో విశేషమనే చెప్పాలి.

- దేశ నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు
- ఐక్యతకు ప్రతీకగా కె.జె.పురం గ్రామస్తులు, యూత్ సభ్యులు
- 1950లోనే విజయవాడ నుంచి విగ్రహాలు తీసుకొచ్చిన మాజీ సర్పంచ్ శ్రీరామూర్తి



గాంధీ వీధిలోని జాతిపిత విగ్రహం



పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



సుభాష్ చంద్రబోస్ విగ్రహం



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం



పాలకుర్తి శ్రీరామ్మూర్తి (ఫైల్)

మాడుగుల రూరల్: దేవతామూర్తులు, గ్రామంలోని అమ్మవార్లకు సంక్రాంతి పండగ తర్వాత తీర్థాలు నిర్వహించడం ఆనవాయితీ. మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ అయిన కె.జె.పురంలో అమ్మవార్లు, దేవతామూర్తులతో పాటు స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన నాయకుల విగ్రహాలకు ప్రతి ఏటా తీర్థాలు నిర్వహించడం పరిపాటిగా వస్తోంది. జాతి పిత మహాత్మాగాంధీ, దివంగత ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్ర బోస్, భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వంటి నేతల విగ్రహాలు కె.జె.పురంలో ప్రతిష్ఠించారు. అలాగే వీధులకు నాయకుల పేర్లు కూడా పెట్టారు. ఈ గ్రామ తొలి సర్పంచ్ దివంగత పాలకుర్తి శ్రీరామ్మూర్తి 1950లో విజయవాడ నుంచి జాతీయ నాయకుల విగ్రహాలను రైలు మీద అనకాపల్లి వరకు తీసుకొచ్చి, అక్కడి నుంచి నాటు బండ్ల మీద గ్రామానికి వాటిని చేరవేయించేవారు. తర్వాత వాటిని పలు గ్రామాల్లో ప్రతిష్ఠించేవారు. ఆయన తన సొంత సొమ్ముతో ఈ మహత్తర కార్యం నిర్వహించేవారు. అలా ఏర్పాటు చేసిన ఆయా విగ్రహాలకు అప్పట్లో తీర్థాలు నిర్వహించడం ప్రారంభించారు. ఆయన అప్పట్లో జిల్లా బోర్డు సభ్యునిగా వ్యవహరించేవారు. అలాగే మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఈ గ్రామానికి చెందిన మాజీ సైనికోద్యోగి అతికంశెట్టి సింహాచలం సొంత నిధులతో తయారు చేయించి, పాలసొసైటీ వద్ద ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ విగ్రహాన్ని ముకుందపురం మాజీ సర్పంచ్, దివంగత కర్రి శ్రీరామూర్తి ఆర్థిక సహకారంతో కాలనీలో ఏర్పాటు చేశారు. గాంధీ తీర్థం ప్రతి ఏటా జనవరి 31న గాంధీ వీధి ప్రజలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ప్రతి ఏటా అక్టోబర్ 2న గాంధీ జయంతి నిర్వహిస్తుంటారు. సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని జనవరి 23వ తేదీన ఆయన పేరిట తీర్థం నిర్వహిస్తుంటారు. నెహ్రూ తీర్థం ప్రతి ఏటా ఫిబ్రవరి 8వ తేదీన నెహ్రూ వీధిలో నిర్వహిస్తున్నారు. గ్రామంలో గల రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ జయంతి, వర్ధంతులను నిర్వహించి, క్రీడా పోటీలు ఏర్పాటు చేస్తుంటారు. ఇలా దేశ నాయకుల పేరిట తీర్థాలు నిర్వహించటమనే మంచి సంప్రదాయం ఇక్కడే కనిపిస్తుంది. వీరితో పాటు మాజీ ప్రధానులు ఇందిర, రాజీవ్‌గాంధీ జయంతి, వర్ధంతులు నిర్వహిస్తు స్థానికులు దేశ సమైక్యత చాటుతున్నారు.

ఐక్యతకు ప్రతీక..



దేశ నాయకుల విగ్రహాలకు తీర్థాలు నిర్వహించడం కె.జె.పురంలో ఆనవాయితీగా వస్తోంది. కీర్తిశేషులు పాలకుర్తి శ్రీరామూర్తి కృషితో జాతీయ నాయకుల విగ్రహాలు గ్రామాల్లో ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాల వద్ద ఆయా నేతల జయంతి, వర్ధంతులు నిర్వహించటం గొప్ప విషయం. ఐక్యతకు ప్రతీకగా కె.జె.పురం గ్రామం నిలుస్తోంది.

– జామి రమణబాబు, సర్పంచ్, కె.జె.పురం గ్రామం, మాడుగుల మండలం

గ్రామానికి చక్కటి పేరొచ్చింది..



1950లో గాంధీ, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను విజయవాడ నుంచి రైలులో ఇక్కడికి తీసుకొచ్చారు. నాటి నుంచి ఆ విగ్రహాలకు తీర్థాలు నిర్వహిస్తున్నారు. అలాగే దేశ నాయకుల పేర్లతో ఇక్కడ వీధులు కూడా ఏర్పాటు అయ్యాయి. పోస్టల్ అడ్రస్‌లో గాంధీ వీధి, నెహ్రూ వీధి అని ప్రాచుర్యం పొందాయి. ఆ పేర్లతో చిరునామాలు కూడా వున్నాయి. పాలకుర్తి శ్రీరామూర్తి కృషితో గ్రామానికి చక్కటి పేరొచ్చింది.

– రాపేట సత్యనారాయణ, సోషల్ వర్కర్, కె.జె.పురం, మాడుగుల మండలం